క్లుప్తంగా

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరుట్ల రవికుమార చార్యులు, క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భూదేవి, శ్రీదేవి సమేతంగా వివాహం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ, ఎస్ఐ

నాగారం : వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్‌లో మండలస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన వారికి మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, ఎస్ఐ ఎం.ఐలయ్య బహుమతులను ప్రదారం చేశారు. కార్యక్రమంలో దాతలు డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి, యారాల రాంరెడ్డి, ఈదుల మురళీ, ఈదుల యాదగిరి, విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్, యారాల రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఈరేటి స్వప్న అంజయ్య, ప్రధానోపాధ్యాయుడు ఎండీ బురహనొద్దీన్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకయ్య, ఫిజికల్ డైరెక్టర్లు కృష్ణమూర్తి, రమేష్, కలమ్మ, మహేశ్వరి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

తుంగతుర్తి : ఓటరు జాబితా సవరణకు గడువును పొడిగించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని తెలిపారు. అవన్నీ సమగ్రంగా సరిచేయాలంటే గడువును కనీసం 10రోజులైనా పెంచాలని అన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

తిరుమలగిరి : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తిరుమలగిరి మండల డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్ అన్నారు. శనివారం గుండెపురి గ్రామంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తులు కలిసికట్టుగా జీవనం సాగించాలని, గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. మూఢ నమ్మకాలను నమ్మవద్దని తెలిపారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. అంటరానితనం నేరమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుశిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- సూర్యాపేట – గరిడేపల్లి ప్రధాన రహదారిపై భారీ గుంతలు
- వర్షాలకు నీరు నిలిచి చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికుల వేడుకోలు

పెన్‌పహాడ్ : సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతల వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో ఈ గుంతలు నీటితో నిండి, రోడ్డు పరిస్థితిని అర్థం చేసుకోలేని విధంగా తయారయ్యాయి. దీని వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని మాచారం, సింగారెడ్డిపాలెం, దూపహాడ్ వంటి గ్రామాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రహదారి పరిస్థితి నానాటికీ అధ్వానంగా మారుతోంది. మాచారంలోని ఒక పెద్ద గుంత వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో, గ్రామస్తులే స్వయంగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. వారు ఆ గుంత చుట్టూ బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే మండల కేంద్రంలోని మరో గుంత వద్ద జెండా కట్టి వాహనదారులను హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్న ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులు లేకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



మాచారంలో భారీ గుంత ఏర్పడడంతో ఏర్పాటు చేసిన బారికేడ్



పెన్‌పహాడ్‌లోని మూల మలుపు వద్ద ఏర్పడిన భారీ గుంత

మరమ్మతులు చేయాలి

రహదారిపై భారీ గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే చాలా కష్టంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి. రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి.

– జానయ్య, మాచారం

త్వరలోనే పనులు చేపడతాం



రహదారి మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్డుపై గుంతలను పూడ్చి, మరమ్మతులు చేయిస్తాం. సమస్యను పరిష్కరిస్తాం. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– యుగేందర్, ఆర్అండ్‌బీ ఏఈ

సుదీర్ఘకాలం సేవలు అభినందనీయం

- ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్ : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించడం అభినందనీయమని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసిన కోదాడ పట్టణ 2వ ఎస్ఐ లింగయ్య, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ భిక్షం, తిరుమలగిరి ఏఎస్ఐ నర్సయ్య, తుంగతుర్తి హెడ్ కానిస్టేబుల్ గోపి నాయక్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారికి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, ఏఓ మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎస్పీ నరసింహ

మైక్‌సెట్ బహూకరణ

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కుదుళ్ల రాము (ఎస్ఐ) అతడి తండ్రి కుదుళ్ల యాదగిరి జ్ఞాపకార్థం శనివారం రెండు మైక్‌సెట్లను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శకుంతల మాట్లాడుతూ దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటయ్య, సీహెచ్.వెంకన్న, కె.శ్రీలత, వి.పద్మావతి, ఎం.సురాంభ, కె.అవిలయ్య, పి.ఝాన్సీ, సీహెచ్ ప్రవీణ్, జి.రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందజేయాలని రైతుల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తుంగతుర్తి : యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. గత 15 రోజుల నుంచి తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అవసరంలేని ఎరువులను, మందులను అంటగట్టి తమ ఇష్టానుసారం రేట్లు వేస్తున్నారని ఆరోపించారు. అనంతరం రైతులకు సరిపోను యూరియా అందేలా ఏర్పాట్లు చేయాలని కోరుతూ తహసీల్దార్ దయానందంకు వినతిపత్రం అందజేశారు. వచ్చేనెల 3వ తేదీ వరకు యూరియా వస్తుందని, అప్పటివరకు రైతులు ఓపిక పట్టాలని తహసీల్దార్ సూచించారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, గాజుల మహేందర్, కోటా రామస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు పటేల్ శ్రీధర్ రెడ్డికి అభినందన సభ

సూర్యాపేట : విద్యా, సామాజిక రంగాలలో విశేష సేవలు అందించినందుకు గానూ 'స్ప్రెడ్ ఇంటర్నెషనల్' అధ్యక్షుడు పటేల్ శ్రీధర్ రెడ్డికి అమెరికాకు చెందిన 'మేరీ ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ' వారు ఆగస్టు 30న ఢిల్లీలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో ఆయనకు పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సూర్యాపేటలోని విద్యా, వ్యాపార, సామజిక, సేవా రంగాల ప్రముఖులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లోక కవి అందెశ్రీ, విశిష్ట అతిథిగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, వివిధ సేవా సంస్థల పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తప్పులు సరిచేయాలని వినతి

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామంలో ఓటరు జాబితాలో అనేక అవకతవకలు ఉన్నాయని, వాటిని వెంటనే సరిదిద్దాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీఓ గోపికి వినతిపత్రం సమర్పించారు. శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పర్సాయపల్లి గ్రామ నాయకులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మిర్యాల వెంకన్న, ఇతర గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని, అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ సూచించారు. రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు పర్యావరణ సమతుల్యతకు, కాలుష్యాన్ని తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిప్పలపెల్లి ధర్మయ్య, పంచాయతీ కార్యదర్శి జె.సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యానవన విస్తరణ అధికారులుగా రాము, ప్రభాకర్

అర్వపల్లి : తుంగతుర్తి, అర్వపల్లి క్లస్టర్ల ఉద్యానవన విస్తరణ అధికారులుగా ఏ.ప్రభాకర్, రాము నియమితులయ్యారు. తుంగతుర్తి, నాగారం, తిరుమలగిరి మండలాలకు ప్రభాకర్ బాధ్యతలు నిర్వర్తించనుండగా, అర్వపల్లి, మద్దిరాల, నూతనకల్ మండలాలకు రాము సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా, అధికారులు ప్రభాకర్, రాము మాట్లాడుతూ తమ క్లస్టర్ల పరిధిలోని రైతులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా పండ్ల తోటలు, ఆయిల్ పామ్, కూరగాయలు, పూల తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

మట్టి గణపతి మేలు



మట్టితో చేసిన బాల వినాయకుడు

సూర్యాపేటలోని బొడ్రాయి బజార్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహానికి బదులుగా గత రెండేళ్లుగా మట్టి గణపయ్యను నెలకొల్పుతున్నారు. పర్యావరణ హితం కోసం మట్టి గణపయ్య ను ప్రతిష్ఠించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పుణ్యం.. బహుమతి భాగ్యం



పీఎస్ఆర్ సెంటర్‌లో గణపతి

సూర్యాపేటలోని పీఎస్ఆర్ సెంటర్‌లో పీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనం రోజున లక్కీ డ్రాను వెల్లడించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డ్రాలో గెలుపొందిన వారికి లక్షా 30 వేల రూపాయల విలువైన స్కూటీతో పాటు 21 కేజీల స్వామి వారి ప్రసాద లడ్డూను బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యమకారుల జేఏసీ నాయకులు

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు గోనె విజయ, ఖమ్మంపాటి లక్ష్మమ్మ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సుమారు 1200 మంది అమరులయ్యారని తెలిపారు. అనేకమంది కేసులకు భయపడకుండా ఉద్యమ సాధనలో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు పుట్టా సోమమ్మ, కార్యదర్శి నోముల ఉమ, పట్టణ అధ్యక్షురాలు బంటు ఎల్లమ్మ, కార్యదర్శి కొమ్మాండ్లపల్లి సుజాత, పట్టణ కమిటీ సభ్యులు మాచర్ల రామలక్ష్మి, సాయని సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేద ప్రజల సొంతింటి కల



లింగాలలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వేణారెడ్డి

పెన్‌పహాడ్ : పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల నెరవేరుతోందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం లింగాల, దూపహాడ్, న్యూబంజారాహిల్స్ తండా, జల్మాలకుంట తండా, యల్లప్పకుంట, గూడెపుకుంట తండాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 3500 ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ అందిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికి రేషన్‌కార్డు అందించిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలందరికీ రేషన్‌కార్డులు అందించిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మిడిమేలపు దామోదర్‌రెడ్డి, అర్తి కేశవులు, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, పిన్నాని కోటేశ్వర్‌రావు, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, గాంధీ, భూక్య సందీప్‌రాథోడ్, శివ నాయక్, సైదిరెడ్డి, దొంగరి సైదులు పాల్గొన్నారు.

గణనాథుడి విగ్రహాల వద్ద పూజలు, అన్నదానం

సూర్యాపేట : గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా అన్నారు. జిల్లా కేంద్రంలోని నల్లాల బావి వద్ద మార్గదర్శి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశుడి విగ్రహం వద్ద శనివారం అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి యూత్ గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల మధు గౌడ్, అధ్యక్షుడు సలిగంటి శ్రీనివాస్, గోపగాని గిరి, సూరయ్య, నేరెళ్ల నరేష్, మిథున్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

హిందూ ధర్మంలో అన్నదానం మహాదానమని బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజేన్ జాడ్ మహాగణపతి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు రాంబాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రెబల్ శ్రీనివాస్, గాజుల రాంబాయమ్మ, శివ, సాయి, రాజీవ్, సన్ని పాల్గొన్నారు.

చివ్వెంల : వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, క్రిష్టారెడ్డి, వీరారెడ్డి, జానయ్య, మార్క్, దిలీప్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని సాయిబాబా ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణేష్ విగ్రహం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరబోయిన మహరాజు, కె.అవిలయ్య, దాసరి సోమయ్య, నాగరాజు, నిరంజన్, నిర్వాహకులు పాల్గొన్నారు.



సూర్యాపేట : పూజలు చేస్తున్న భక్తులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో పూజలు..

నాగారం : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పసునూర్‌లో మెగా యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద తొడుసు సోమక్క జ్ఞాపకార్థం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగా యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాస్ సాయికుమార్ విమర్శించారు. శనివారం సీపీఎం వన్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఏడో వార్డులో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజల కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. అలాగే వన్ టౌన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు సీపీఎం శాఖ కార్యదర్శి రాచూరి జానకి రాములు, సహాయ కార్యదర్శి దున్న ప్రమోద్, నాయకులు రాచూరి భవాని, గోపాల్ రావు, చొగాని లక్ష్మయ్య, సోమగాని బాలాజీ, కావలి శ్రీను, రాచూరి నర్సయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

సుందరయ్య నగర్‌పై నిర్లక్ష్యం

పట్టణంలోని సుందరయ్య నగర్ అభివృద్ధి పట్ల మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి లేదని, ప్రజా సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకునే వారే లేరని సీపీఎం టూ టౌన్ కార్యదర్శి పిండికి నాగమణి అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డు సుందరయ్య నగర్‌లో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. సుందరయ్య కాలనీలో అనేకమంది పేదలు పక్కా ఇళ్లు లేక గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం టూ టౌన్ కమిటీ సభ్యులు బత్తుల వెంకన్న, ముక్కెర్ల వెంకన్న, కంచుగట్ల శ్రీనివాస్, శీరంశెట్టి శ్రీనివాస్, శాఖ సభ్యులు లింగమ్మ, వెంకటమ్మ, రేణుక, జానకమ్మ పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న నాయకులు

లబ్ధిదారుల ఎంపికలో కొరవడిన పారదర్శకత

మద్దిరాల : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ముకుందాపురంలో ప్రజాసమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో సమస్యలు తీవ్ర రూపం దాల్చుతున్నా పట్టించుకునే వారే లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, మద్దెల కోటయ్య, కల్లెపల్లి భాస్కర్, దీకొండ ఉపేందర్, బ్రహ్మం, శివరాత్రి మల్లయ్య, ఆలకుంట్ల ఇద్దయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ నాయకులతో సమీక్ష

నాగారం : ముసాయిదా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని మండల ప్రత్యేక అధికారి, డీఈఓ అశోక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా ముసాయిదా ఓటరు జాబితా సవరణకు సహకరించాలని కోరారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరి కిషోర్‌శర్మ, ఎంపీడీఓ మారయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఎం.బాలు మాట్లాడారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రదర్శించిన ముసాయిదా ఓటరు జాబితాను సరిచూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ లాజరస్, మండల పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

పెన్‌పహాడ్ : ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి రాము అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదాలపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ జానయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముసాయిదా ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశమయ్యారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఓటరు ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, మార్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఓ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, ఎంపీడీఓ టి.గోపి, సూపరింటెండెంట్ రామకృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఓటరు జాబితాలో అభ్యంతరాలపై శనివారం మండల స్థాయి అఖిలపక్ష నాయకులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. ఓటర్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ హసీం, వివిధ పార్టీల నాయకులు తూడి నరసింహారావు, తంగెళ్ల వీరారెడ్డి, దేగల వెంకటకృష్ణ, బత్తుల ప్రసాద్, శిగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ముసాయిదా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పార్టీల రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల మండల అధ్యక్షులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆత్మకూర్ (ఎస్) : వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులతో నష్టపరిహారం అంచన వేసి తక్షణమే సహాయం అందించాలని, యూరియా కొరత నివారించాలని కోరారు.

ర్యాంపులు ఉన్నచోటే పింఛన్లు ఇవ్వాలి

అర్వపల్లి : ర్యాంపులు ఉన్నచోటే దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేయాలని ఆలిండియా దివ్యాంగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేటి వెంకన్న అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం అర్వపల్లిలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా పోస్టల్ సిబ్బంది పింఛన్లను చిన్న గల్లీలలో, ఇరుకు గదులలో పంపిణీ చేయడం వల్ల దివ్యాంగులు అక్కడికి వెళ్లలేకపోతున్నారని తెలిపారు. అంతేకాకుండా పోస్టల్ సిబ్బంది దివ్యాంగులకు రూ.4,016 బదులు చిల్లర లేదనే సాకుతో రూ.4,000 మాత్రమే ఇస్తున్నారని, రూ.16 తక్కువగా ఇస్తున్నారని వెంకన్న ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, కృష్ణస్వామి, ఆంజనేయులు, సోమయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పారదర్శకంగా ఉండాలి

నూతనకల్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పట్ల అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని జాగృతి జిల్లా అధ్యక్షురాలు సూరారపు కృష్ణవేణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేస్తామనే హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. లబ్ధిదారుల నుంచి అధికారులు, అధికార పార్టీ నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు.

మహర్షి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పల్లె నగేష్, కరస్పాండెంట్ నారాయణ ప్రవీణ్ రెడ్డి, చైర్మన్ జిన్నె రమాదేవి మాట్లాడారు. సెమిస్టర్ పరీక్షలలో 10కి 10 జీపీఏ సాధించే విద్యార్థులకు రూ.10వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.